కథ

మొదట్నుంటి కూడా నగలూ, నాణ్యాలూ, మంచిచీరలు వీటికి నేను ఎప్పుడూ ప్రాముఖ్యం ఇవ్వలేదు. వంటింటి అందాన్ని రెట్టింపు చేసే సామాన్లనే వీటినే ఎక్కువ ఇష్టపడేదాన్ని. నాకు వంటిల్లు ఓ సామ్రాజ్యం. దాన్ని ఎలాగైనా, ఏ కోణంలోంచి చూసినా అబ్బా! అనిపించేలా చెయ్యాలని నా తాపత్రయం.

# కూలిపోయిన సామ్రాజ్యం


ఒంటి భానుమతి

నేను పుట్టింది పెరిగింది అమలాపురం దగ్గర ఓ పల్లెటూరు. అక్కడ మాఇంట్లో వంటిల్లు, నట్టిల్లు అని రెండు పక్కపక్కగా ఉండేవి. ఆ రెండు కూడా మట్టినేలలు. వంటింట్లో పొట్టి మట్టిపొయ్యి. మట్టిపొయిల్ని రోజూ రాత్రి కడిగి, ముగ్గు చేతిలో వేసుకుని, నాల్గు మొట్టికాయలు, మొట్టి నాలుగు రేఖలు వేసేదాన్ని. ప్రతి శుక్రవారం నట్టిల్లు వంటిల్లు అలికి, ముగ్గుని గుప్పెట్లో పోసుకుని, వేళ్ల మధ్యలోంచి సన్నగా జారుస్తూ గీతలు గీస్తూ పోయ్యేదాన్ని. ఆ తర్వాత ముగ్గు గొట్టం కొన్నాకా ముగ్గు వెయ్యడం చాలా సులువు. ఈ పనుల్నీ ఎంతో ఇష్టంగా చేసేదాన్ని.

"అమ్మా వంటకి గట్టు కట్టించుకుందాం. హాయిగా నుంచుని నీట్‌గా చేసుకోవచ్చు" ససేమిరా కుదర్దన్నారు. 'గ్యాస్ కొందాం. అందరిళ్లల్లో ఉంది' అంటే "చాల్లే రోజూ దేవతార్చన అదీ చేసుకునేవాళ్లం. మడీ ఆచారం వాళ్లం. రోజు గ్యాస్‌మీద ఎలా చేస్తాం!" నా ఉత్సాహం మీద నీళ్లు పోసారు.

ఏదైనా అంటే, "నీకు పెళ్లయ్యాకా, నీ వంటిల్లు నచ్చినట్లుగా నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో. అందుకే ఈ అమలాపురం, పల్లెటూళ్లు వదిలి నీకు హైదరాబాద్ సంబంధం చూస్తున్నాం."

పెళ్లయ్యాకా హైదరాబాదొచ్చాను. ఆ ఇంట్లో వంటిల్లుంది. ఆ వంటిల్లు మా అత్తగారిదని తెలయుడానికి ఎంతోకాలం పట్టలేదు. నాగది ఓ పడగ్గది మాత్రమే. ఆవిడకి సాయం చెయ్యడానికి నేనుండాలి. కానీ, ఏం ముట్టుకోవడానికి లేదు. ఓ రోజున ఎంతో ఉత్సాహంగా డబ్బాలు, సీసాలు, గాజుసామాన్లు అన్నీ సర్దాను.



ఆవిడ వచ్చాకా నన్ను ఏమీ అనలేదు కానీ, ఇదివరకు లాగానే ఆవిడ పూర్వస్థితికి వంటింటిని తీసుకొచ్చారు. ఆవిడ అనుమతి లేకుండా ఆమెకి ఇష్టం లేకుండా ఒక్క చెమ్చా కూడా కదలకూడదు అని. సరే ఇంక ఏ పనీ లేనప్పుడు ఇంట్లో ఖాళీగా కూర్చోవడం ఎందుకని ఉద్యోగంలో చేరాను. అత్తగారు పోయాకా వంటింటి సామ్రాజ్యం నా హస్తగతం అయింది. కానీ, డబ్బుకు కటకట. టైల్సు వేయిద్దాం అని అనుకున్నప్పుడో, కడపరాయి సింకు తీసేసి స్టీలు సింక్ పెట్టించుకుందాం అనుకున్నప్పుడో, అలమారలు దుమ్ము కొట్టుకుంటున్నాయి డెకొలం తలుపులు పెట్టించుకుందాం అని అనుకున్నప్పుడు డబ్బు ఇబ్బంది. ఏదో ఖర్చు. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. ఎమ్‌సెట్ కోచింగ్‌లు, చదువులు ఇలా ప్రతీసారి ఏదో ఖర్చు నా వంటిల్లు దొంగాట దోబూచులాటలే.

ఓసారి నాన్నగారికి ఒంట్లో బాగాలేదంటే ఊరెళ్లాను. నేనొచ్చాను కదాని, పెద్దొదిన వాళ్ల

నాన్నగారు జారిపడ్డారుట అని కబురొస్తే నేదునూరు వెళ్లింది. మేనకోడలు అమెరికా నుంచి వచ్చిందని చిన్నవదిన నందంపూడి వెళ్లింది. నాలుగురోజులు అమ్మా నేను బోల్డు కబుర్లు చెప్పుకుంటూ నాన్నగారిదగ్గర కూర్చుని అడ్డాట, పేకాటాడుకుంటా కులాసాగా గడిపేశాను.

"ఒక్క నాలుగురోజులు లేకపోతే వంటిల్లు తల్లకిందులైపోయింది. కాఫీపొడి దగ్గర, టీ పొడుం దగ్గర పోపు సామాన్ల డబ్బాలున్నాయి. నా చెయ్యికి వీలుగా, నేను అన్ని కుడిచేతివైపు పెట్టుకుంటే, అన్ని ఇటుదటూ, అటుదిటూ చేసింది. వేరేవాళ్ల ఇంటి వంటిల్లు ఇలా చెయ్యడంలో ఏం సంతోషం వస్తుందో... ఏం ఆనందం వస్తుందో... అర్థం కాదు."

ఎంత పిచ్చిదాన్ని నా పెళ్లయ్యాకా ఆ ఇల్లు పరాయి ఇల్లు అని తెలియడానికి ఇంతకాలం పట్టిందా!

నాకు, ఆయనకి ప్రమోషన్లు వచ్చినా, జీతాలు పెరిగినా నా మోడర్న్ వంటింటి కోరిక అలాగే ఉండిపోయింది. పెద్ద పిల్లాడి చదువైంది. మంచి ఉద్యోగమే వచ్చింది. ఆయన కూడా బ్యాంక్‌లో చాలా మంది విఆర్‌ఎస్ తీసుకున్నారంటూ తను కూడా తీసుకున్నారు.

మేమిద్దరం తెల్లవారుజామున కాఫీ తాగుతున్నప్పుడు పిచ్చాపాటి వేసుకుంటూ చాలా ఇంపార్టెంట్ డెసిషన్స్ తీసేసుకుంటాం.

ఎప్పటిలా కాఫీ ఇచ్చి నేను వంటింటి గురించి అడిగాను

"వంటింటిని మార్చాలి..."

"ఏదైనా వాస్తు గురించా..."

"అది కాదు--ఇల్లు కట్టినప్పట్నించి అడుగుతున్నాను. పెరిగే పిల్లలు, చదువుల మూలంగా వంటింటిని అలాగే ఉంచేసాం. ఇప్పుడు డబ్బు ఇబ్బందులేం లేవు. అబ్బాయికి మంచి ఉద్యోగం ఉంది..."

"ఓ.కే. వంటింటిని రెనోవేట్ చేయించాలంటావ్. ఓ.కె. సాంక్షన్"

"ఉండండి... " మంచం మీంచి లేచి, పరుపు కింద దాచిన, ఫెమినా లోంచి, విమెన్స్ ఎరా లోంచి కట్ చేసినవి ఆయనకి చూపించా. ఆయన కూడా చాలా ఇంప్రెస్ అయ్యారు. ఆ తర్వాత అన్ని చకాచకా జరిగిపోయాయి. కుకింగ్‌రేంజ్, ఎలక్ట్రిక్ చిమ్నీ, లామినేటెడ్ కిచెన్ కౌంటర్, కిటికీ కి వెనీషియన్ బ్లైండ్స్, క్రీపర్, ఒవెన్, మైక్రో ఒవెన్ అన్నీ అందంగా అమర్చి ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా వస్తువులు వాడనివి, గిఫ్టులు, సేల్‌లో కొన్న మిస్ట్ గ్లాసులు, క్రిస్టల్ గ్లాసులు, పెడస్టల్ గ్లాసులు, అన్నీ కూడా అందంగా, అద్దాల వెనకాల సర్దాను. పైరెక్స్ కాస్సెరోల్స్, బోన్ చైనావి అన్ని కూడా దొంతులుగా అందంగా సర్దాను. ఉద్యోగం కూడా మానేశాను.

రోజు వంటింట్లో తుడిచేవని, మైక్రో ఒవెన్‌లో వంట చేస్తూ ప్రతీ నిమిషం ఎంజాయ్ చేస్తూ గడిపేస్తున్నాను. అసలు ఎన్నిరోజులైందో నాకే తెలీదు. పైగా ఉత్సాహం రోజురోజుకి ఎక్కువై మానసికంగా పదేళ్లు వెనక్కి నన్ను జార్చింది.

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. అందరూ భోజనాలు చేసారు. మేము తిన్న వెండికంచాలు, గ్లాసులు, చెంబు కడిగి బట్టపెట్టి తుడుస్తున్నాను.

ఫోన్ మ్రోగింది. కోడలు తన గదిలో పడుకుని ఉంటుంది అని అనుకుంటూనే వెంటనే రిసీవర్ ఎత్తాను. "హలో" అనే లోపలే అవతల నుంచి కోడలు గొంతు 'హలో' అంది.

"ఏం చేస్తున్నావు?" అవతలి గొంతు.

"పక్కేక్కాను. ఏదో మాగజైన్ చదువుతున్నాను" కిలకిలా నవ్వు.

"నీకేవే అదృష్టవంతురాలివి. అత్తగార్ని వంటింట్లో కట్టేశావ్?"

"కోతికి కొబ్బరికాయ. ఎవరి పిచ్చి వాళ్లకానందం" గలగలా నవ్వులు.

"నీకు చాలా తెలివుంది బాబూ! నాకో ఉపాయం చూపించకూడదు. నీలాంటి భోగం నాకు పట్టేందుకు..."

"అలంకృత వాళ్లు డిస్కౌంట్ ఇస్తున్నారుట. మీ వంటింటిని డిజైనర్ వంటిల్లులా చేయించు. మా అత్తగారిలా, మీ అత్తగారు కూడా ఒక్కటే సర్దడం, తుడవడం, దులపడం, వీలైతే డిష్‌వాషర్ కూడా... పనిమనిషిని మాన్పించవచ్చు.."

ఆగకుండా, పకపకా నవ్వులు.

తల తిరిగిపోతోంది. కళ్లు మూసుకున్నాను.

అంతకు ముందున్న ఉత్సాహం ఆవిరి అయ్యి పైకెళ్లిపోయింది. నిర్వీర్యంగా, నిస్ప్రాణంగా అలాగే జారి కూర్చుండిపోయాను.

నా చిన్నప్పటి ఆశలు, నేను కన్న కలలు, నా సామ్రాజ్యం, ముక్కలు ముక్కలుగా పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ మంటలు రేపేస్తూ చెదురుమదురుగా నా కళ్ల ముందు పడిపోతున్నాయి. ■

